Follow: @ANNTELUGU

18-11-2025

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 330 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## 42 మంది సజీవ దహనం

### సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం

- భారతీయ యాత్రికుల బస్సును ఢీకొట్టిన డీజిల్ ట్యాంకర్
- అక్కడికక్కడే మంటల్లో 42 మంది సజీవం.. ఒకే ఒక్కడు సేఫ్
- ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో 18 మంది మృత్యువాత
- మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ప్రమాదం.. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు
- సంతాపం ప్రకటించిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు, మంత్రులు
- ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. భారతీయ యాత్రికులతో ఉన్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొనడంతో 42 మంది సజీవ దహనమైనట్లు తెలుస్తోంది. మృతుల్లో అందరూ హైదరాబాద్ వాసులే. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 46 మంది ఉండగా, ఒకరు మాత్రం ప్రాణాలతో బయపడ్డారు. భారత కాలమాన ప్రకారం సోమవారం తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మక్కా నుంచి మదీనాకు వెళ్తుండగా ముఫరహత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్ను యాత్రికుల బస్సు ఢీకొట్టింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగినపుడు ఎక్కువ మంది గాఢనిద్రలో ఉన్నారు. సమాచారం అందిన వెంటనే సౌదీ అధికారులు, రక్షణ బృందాలను ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడినవారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, వారిని సమీప ఆసుపత్రుల్లో చేర్చామని అధికారులు వర్గాలు పేర్కొన్నాయి. మృతుల సంఖ్యను ధృవీకరించే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారని సౌదీ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ ప్రమాదం నుంచి ఓ వ్యక్తి బయటపడినట్లుగా తెలుస్తోంది. మిగతా 2లో

### న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కాంటాక్ట్ నంబర్లు..

వందన, పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్-
**+91 98719 99044**

సీహెచ్. చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్-
**+91 99583 22143**

రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్-
**+91 96437 23157**

టాప్ న్యూస్

## భగ్గుమన్న త్రిష

- ఎంతమందితో పెళ్ళిచేస్తారంటూ ఫైర్

02



స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్‌లు

## 50 శాతం మించొద్దు

- మహారాష్ట్రకు సుప్రీం ఆదేశాలు

02



## చేతనైతే హరీష్ రావు వివరణ ఇవ్వాలి

- పిల్లిమీద పిట్టమీద పెట్టి తిట్టిస్తారా?
- బీఆర్ఎస్ నేతల విమర్శలపై భగ్గుమన్న కవిత

02



# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష



- ఈ తీర్పు మోసపూరితమైంది షేక్ హసీనా
- సంచలన తీర్పుపై ఆచితూచి స్పందించిన భారత్
- 78 ఏళ్ళ హసీనా కు ఉరిశిక్షపై బంగ్లాదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు
- ప్రపంచంలోనే ఎక్కువ కాలం పనిచేసిన మహిళాధినేత
- ఉక్కుమహిళగా పేరు.. రెండుదశాబ్దాలు ఎదురులేని నేత

**మహా, స్పెషల్ బ్యూరో**

బంగ్లాదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాపై మోపిన మానవత్వ వ్యతిరేక నేరాల కేసులో.. సోమవారం రోజు ప్రత్యేక ట్రిబ్యునల్ తీర్పును వెలువరించింది. దశాబ్దాల పాటు బంగ్లాదేశ్ రాజకీయ చరిత్రను అన్నీ తానై నడిపించిన 'ఉక్కు మహిళ' షేక్ హసీనాకు అనూహ్యంగా ఐసీటీ మరణశిక్ష విధించింది. బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ సంచలన తీర్పు వెలువరించింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ను దోషిగా తేల్చింది. ఆమెకు మరణ శిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో ఆమెపై పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. వీటిపై వాదనలు విన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ సోమవారం ఆమెను దోషిగా తేల్చింది. గత ఏడాది జులైఆగస్టుల్లో జరిగిన ఆందోళనల్లో 1400 మంది మృతి చెందారని ఐసీటీ న్యాయమూర్తి వెల్లడించారు. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిని చంపేయమని ఆమె ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు సైతం కోర్టు మరణశిక్ష విధించింది. మిగతా 2లో

### 78 ఏళ్ల షేక్ హసీనాపై ఆమె గైర్హాజరీలోనే..

78 ఏళ్ల షేక్ హసీనాపై ఆమె గైర్హాజరీలోనే విచారణ జరిగింది.ప్రాసిక్యూషన్ ఆమెకు మరణశిక్ష విధించాలని పదేపదే ట్రిబ్యునల్‌నుకోరింది. ఐసీటీ-బీడీ ప్రాసిక్యూటర్ గాజీ ఎంహెచ్ తమీమ్ మాట్లాడుతూ.. "మేము హసీనాకు అత్యధిక శిక్షను కోరాము. అంతేకాకుండా గతేడాది హింసాత్మక వీధి నిరసనల్లో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం అందించేందుకు దోషుల ఆస్తులను జప్తు చేయాలని కూడా అభ్యర్థించాము" అని తెలిపారు. ఐసీటీ-బీడీ చట్టం ప్రకారం.. హసీనా లొంగిపోతే తప్ప తీర్పు వెలువడిన 30 రోజుల్లోపు ఆమె సుప్రీం కోర్టు అప్పీలేట్ డివిజన్‌లో తీర్పును సవాలు చేయలేరని తమీమ్ స్పష్టం చేశారు.



సంధ్యా శ్రీధర్ రావు అక్రమ నిర్మాణాలపై

## హైడ్రా చర్యలు

- రహదారులకు అడ్డుగా నిర్మించిన భారీ భవనాల కూల్చివేత
- హైకోర్టు ఆదేశాల మేరకు రహదారులను పునరుద్ధరించిన హైడ్రా

వివరాలు 3లో




## సర్పంచ్ ఎన్నికలే ఫస్ట్

- తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ
- స్థానిక ఎన్నికలపై సర్కారు నిర్ణయం
- డిసెంబర్ లోనే ఎన్నికలు

వివరాలు 2లో

## మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము నిర్ణయం తీసుకోవాలా?

- ఎమ్మెల్యేల అనర్హత అంశంలో స్పీకర్ పై సుప్రీం ఆగ్రహం
- స్పీకర్ కు రాజ్యాంగరక్షణ లేదని తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు
- న్యూఇయర్ ఎక్కడ జరుపుకోవాలో నిర్ణయించుకోండి
- నాలుగువారాల్లో జవాబుచెప్పాలని ఆదేశం



**ఢిల్లీ, మహా :** తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టు ధిక్కార పిటిషన్‌పై స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ మిగతా 2లో

## ఓట్ చోరీతో రాజ్యాంగానికి తూట్లు

### బీహార్ ఎన్డీయే కూటమి గెలుపు అప్రజాస్వామికం

- అధికార పరమావధిగా మోడీ, అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడుతున్నారు
- కాంగ్రెస్ మహా నిరసన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హాట్ కామెంట్స్
- దేశవ్యాప్తంగా ఓటు చోరీపై నిరసనలు ఉద్ధృతం చేయాలి: మంత్రి పొన్నం

03






## ఐబొమ్మతో రవి 20 కోట్ల సంపాదన

### అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లు

- ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం
- పైరసీలో సినిమాలు చూసే వాళ్లపై నిఘా పెట్టాం: సజ్జనార్
- హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ

08



## ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్లే మా ఓటమి

- హుజూరాబాద్, దుబ్బాకలో డిపాజిట్ కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా?
- జూబ్లీహిల్స్‌లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోతుందా?
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్

02



# 42 మంది సజీవ దహనం

## సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం

- భారతీయ యాత్రికుల బస్సును ఢీకొట్టిన డీజిల్ ట్యాంకర్
- అక్కడికక్కడే మంటల్లో 42 మంది సజీవం.. ఒకే ఒక్కడు సేఫ్
- ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో 18 మంది మృత్యువాత
- మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ప్రమాదం.. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు
- సంతాపం ప్రకటించిన ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు, మంత్రులు
- ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం





### తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం..

సౌదీలో జరిగిన బస్సు ప్రమాదం ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారిని గుర్తించాలని, గాయపడిన వారికి అన్ని విధాలా సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, సౌదీ రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు సహాయం చేయడానికి తెలంగాణ సచివాలయంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ప్రమాదానికి సంబంధించి బాధితుల కుటుంబాలకు సమాచారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు హెల్ప్‌లైన్ నంబర్‌లను విడుదల చేసింది, తద్వారా కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం అందుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

ఈ భయంకరమైన ప్రమాదం నుంచి కేవలం ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలతో ఒకే ఒక్క వ్యక్తి బయటపడ్డాడు. ఆ వ్యక్తి పేరు మహ్మద్ అబ్దుల్ షోయబ్(24) కాగా.. ఇతను హైదరాబాద్ నగరానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ప్రమాదం సమయంలో షోయబ్ బస్సు డ్రైవర్ సమీపంలో కూర్చున్నందున ప్రమాదం నుంచి బయటపడగలిగాడు. అయితే షోయబ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

**ఒకే కుటుంబంలో 18 మంది మృతి..**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బస్సులో 42 మంది. అందరూ హైదరాబాద్ నివాసులు. 42 మంది (31 మంది పెద్దలు, వీరిలో 20 మంది మహిళలు; 11 మంది చిన్నారులు). కొంత మంది తీవ్ర గాయాలతో మదీనా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణ యాత్రికులు సజీవ దహనం అయ్యారు. మక్కా నుండి మదీనాకు ప్రయాణిస్తున్న సమయంలో డీజిల్ ట్యాంకర్, యాత్రికుల బస్సు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 45 మంది చనిపోయారు. మొత్తం మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. తెలంగాణ యాత్రికులు కొందరు ఉన్నట్టు తెలియడంతో సౌదీలో బస్సు ప్రమాదానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు సౌదీ అరేబియా రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నారు. బస్సు ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, తెలంగాణ నుంచి ఎంత మంది వ్యక్తులు ఉన్నారో నిర్ధారించడానికి చర్యలు చేపట్టారు.

**మోదీ దిగ్భ్రాంతి..**

సౌదీ బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ అరేబియా అధికారులతో భారత సిబ్బంది నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. రియాద్, జెడ్డాలోని భారత రాయబార కార్యాలయాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**స్పందించిన విదేశాంగ మంత్రి..**

ఈ దుర్ఘటనపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. ప్రభావిత కుటుంబాలకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నాయని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

**ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం..**

సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ₹5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని ప్రభుత్వం నిర్ణయించారు. మృతులకు సౌదీ అరేబియాలో వారి మతపరమైన ఆచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని, ప్రతి కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి నుండి ఇద్దరు కుటుంబ సభ్యులను సౌదీ అరేబియాకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలని కూడా నిర్ణయించారు. మైనారిటీ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, ఎంఐఎం నుండి ఎమ్మెల్యే, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారితో కూడిన అధికారిక ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీ అరేబియాకు పంపడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.





## భగ్గుమన్న త్రిష

### ఎంతమందితో పెళ్ళిచేస్తారంటూ ఫైర్

**మహా:** విజయ్ తో పెళ్ళి రూమర్స్ పై, త్రిష త్వరలోనే విజయ్ పార్టీలో చేరనుందన్న పుకార్లపై త్రిష గతంలో సీరియస్ గా తీసుకోలేదు. కానీ, ఈసారి మాత్రం అమ్మడు సీరియస్ గా రియాక్ట్ అయ్యింది. ఎంతమందితో నా పెళ్లి చేస్తారు అంటూ మండిపడింది. త్రిష తన పెళ్లి, రాజకీయాలు గురించి వస్తున్న వార్తలపై స్పందించింది. ' నా పెళ్లి, పొలిటికల్ ఎంట్రీ అంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఒక వ్యక్తితో కలిసి ఫోటోలు దిగితే మా ఇద్దరికీ పెళ్లి చేస్తారా.. ? ఫ్రెండ్స్ తో ఫోటోలు దిగకూడదా.. ? ఎంతమంది తో నా పెళ్లి చేస్తారు. ఇలాంటి వార్తలు చూస్తుంటే అసహ్యమేస్తుంది. ఇలాంటి ఆధారాలు లేని పుకార్లు పుట్టించడం ఆపండి' అంటూ చెప్పుకొచ్చింది. మరి ఇప్పుడైనా ఈ వార్తలు ఆగుతాయేమో చూడాలి.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ మాజీ చీఫ్ చౌధురీ అబ్దుల్లా అల్‌మామున్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఆగస్టు 5న ఢాకాలో నిరసనకారులపై ఆర్మీ కాల్పులు జరిపిందని, వారిపై హెలికాప్టర్లు, ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించాలని ఆమె ఆదేశించారని మరో న్యాయమూర్తి తీర్పులో ప్రస్తావించారు. ఈ మేరకు దర్యాప్తు నివేదికను చదివి వినిపించారు. గాయపడినవారికి వైద్యం అందించేందుకు నిరాకరించారన్నారు. ఆమె అధికారంలో ఉండేందుకు బలప్రయోగం చేశారని పేర్కొన్నారు. తీర్పు ఇవ్వడంలో ఏదైనా ఆలస్యం జరిగితే క్షమించాలన్నారు. ఇక తీర్పు నేపథ్యంలో ఐసీటీ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశరాజకీయాలపై చెరగని ముద్రవేయడంతో పాటు ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబానికి చెందిన వ్యక్తికి మరణశిక్ష విధించడంపై ప్రపంచం నివ్వెరపోయింది.

**ఈ తీర్పు మోసపూరితమైంది- షేక్ హసీనా**

ఐసీటీ తీర్పుపై తాజాగా షేక్ హసీనా స్పందించారు. ఈ తీర్పు మోసపూరితమైనదని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకోకుండా ఏర్పడ్డ ప్రభుత్వం తనకు కావాలనే కుట్రపూరితంగా శిక్ష పడేలా చేశారని మండిపడ్డారు. కనీసం తనను తాను నిరూపించుకునేందుకు కోర్టు ఛాన్స్ ఇవ్వలేదని వాపోయారు. న్యాయమూర్తులు కూడా ఈ విషయంలో పక్షపాతం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి కోర్టు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని తెలిపారు. తమ దేశంలో విద్య, ఉద్యోగాలు, పేదరిక నిర్మూలణ, అభివృద్ధి లాంటి అనేక విషయాల్లో ఎన్నో చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 2010లో బంగ్లాదేశ్‌ను ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులో చేరేలా తమ ప్రభుత్వమే నడిపించిందని తెలిపారు. మయన్మార్‌లో హింస జరిగినప్పుడు బంగ్లాదేశ్‌కు వచ్చిన లక్షలాది మంది రోహింగ్యాలకు ఆశ్రయం కల్పించామని పేర్కొన్నారు.

**ఆచితూచి స్పందించిన భారత విదేశాంగశాఖ**

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కు మరణశిక్ష విధిస్తూ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై భారత విదేశాంగ శాఖ ఆచితూచి స్పందించింది. పొరుగుదేశంగా బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపింది. ఇందుకోసం సంబంధిత పక్షాలతో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. 'బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించి ఐసీటీ ఇచ్చిన తీర్పును గమనించాం. పొరుగుదేశంగా బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం. బంగ్లాలో శాంతి, ప్రజాస్వామం, స్థిరత్వం విషయంలో అన్ని పక్షాలతో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తాం' అని విదేశాంగ శాఖ తెలిపింది.

## చేతనైతే హరీష్ రావు వివరణ ఇవ్వాలి

### పిల్లిమీద పిట్టమీద పెట్టి తిట్టిస్తారా?

### బీఆర్ఎస్ నేతల విమర్శలపై భగ్గుమన్న కవిత

**ఖమ్మం, మహా :** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి హరీశ్ రావుపై విమర్శలు గుప్పించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన కవిత తనమీద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, హరీశ్ రావు అనుచరులు చేస్తున్న విమర్శలపై స్పందించారు. హరీశ్ రావు మీద ఆరోపణలు వస్తే ఆయన వివరణ ఇవ్వాలి తప్ప ప్రతిసారి వందిమాగధులు తమ తరపున మాట్లాడుతారంటే ప్రజాస్వామ్యంలో కుదరదన్నారు. ఆరోపణలు వచ్చిన వ్యక్తులు సమాధానం చెబుతారా లేదా అన్ని ప్రజలు గమనిస్తారన్నారు. పిల్లి మీద పిట్ట మీద పెట్టి వాళ్లతో వీళ్లతో తిట్టిస్తామంటే ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రేపు మీడియా సమావేశంలో అన్ని విషయాలు మాట్లాడుతానన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవటమనేది ప్రధాన ప్రతిపక్షాల వైఫల్యమేనని కవిత ఆరోపించారు. సాధారణంగా ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఇతర పార్టీలు గెలిచిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ మీద చాలా వ్యతిరేకత ఉందని గ్రామాల్లోకి వెళితే ప్రజలు ఆ పార్టీని తిడుతున్నారు.



ఇచ్చిన ఒక్క హామీని కూడా నేరవేర్చలేదు. ఆరు గ్యారంటీలు అమలు కావటం లేదన్నారు. అయినా కూడా కాంగ్రెస్ గెలిచిందంటే ప్రతిపక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్ స్పష్టంగా విఫలమైందని అర్థం అవుతోందని దుయ్యబట్టారు. ప్రజల సమస్యలపై చేయాల్సినంత పోరాటం ఆ పార్టీలు చేయటం లేదని అందుకే ఆ బాధ్యతను తెలంగాణ జాగృతి తన భుజాన వేసుకుందన్నారు.

## మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము నిర్ణయం తీసుకోవాలా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వచ్చే వారం లోపలే నిర్ణయం తీసుకోవాలి, లేదంటే స్పీకర్ కాంటెంప్ట్‌కు సిద్ధం కావాలని స్పష్టం చేసింది. స్పీకర్‌కు రాజ్యాంగ రక్షణ లేదని ముందే చెప్పామని గుర్తుచేసింది. న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలని సీజేఐ ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. దీంతో, స్పీకర్ తరపున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం, రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని స్పీకర్‌ను ఆదేశించింది.

## ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్లే మా ఓటమి

### హుజూరాబాద్, దుబ్బాకలో డిపాజిట్ కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా?

### జూబ్లీహిల్స్‌లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోతుందా?

### బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్లే ఓటమి పాలైందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాత్రం గత ఆరు నెలల నుంచే ఎన్నికల కార్యాచరణ ప్రారంభించాయన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోయిందని మాట్లాడటం సరికాదన్నారు. 'హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా? తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 9 ఉప ఎన్నికలు జరగ్గా అందులో 7 సందర్భాల్లో అధికార పార్టీ గెలిచింది. రెండింట్లో బీజేపీ గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికలో అధికార పార్టీ డబ్బులు, చీరలు పంపిణీ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడింది. హైదరాబాద్‌లో పాలనా వ్యవస్థ



పూర్తిగా కుంటుపడింది. నగర జనాభాను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా చేపట్టాలి. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలపై విన్నవిస్తా. ఖాళీగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే కేటాయించాలని, పేదల ఇళ్లను హైడ్రా కూల్చకుండా చూడాలని కోరతా''అని ఎంపీ ఈటల చెప్పారు.

## సర్పంచ్ ఎన్నికలే ఫస్ట్..

### తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ

### స్థానిక ఎన్నికలపై సర్కారు నిర్ణయం.. డిసెంబర్ లోనే ఎన్నికలు

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయబావుట ఎగురవేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాంటి వేళ రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 9వ తేదీ తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. డిసెంబర్ లో స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయని మహాపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. కేబినెట్ లో కూడా డిసెంబర్ లో ఎన్నికకు నిర్ణయం తీసుకున్నారు. తొలుత సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని.. ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లకు ఆదేశాలు ఇవ్వాలని ఈ భేటీలో నిర్ణయించారు. అలాగే 50 శాతం రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. మరో వారం, పది రోజుల్లో ఈ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత ఎన్నికలకు వెళ్లనున్నారు. సోమవారం నాడు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. దాదాపు నాలుగు గంటలపైనే ఈ భేటీ కొనసాగింది. ఈ సమావేశంలో గిగ్ వర్కర్ల బిల్లుకూ కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. 50% రిజర్వేషన్లకు లోబడి ఎన్నికలకు వెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## 'స్థానిక' ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించొద్దు

### మహారాష్ట్రకు 'సుప్రీం' ఆదేశాలు

**మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించవద్దని మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రిజర్వేషన్ కోటా పరిమితులను ఉల్లంఘిస్తే ఎన్నికలను నిలిపివేయాలని హెచ్చరించింది. ఓబీసీల రిజర్వేషన్ కోటా 27 శాతానికి పెంచుతూ జేకే బాంటియా కమిషన్ చేసిన సిఫార్సు నివేదిక చట్టబద్దతను ధర్మాసనం ప్రశ్నించింది. 2022కు ముందు ఉన్న పరిస్థితి ప్రకారం ఎన్నికలు నిర్వహించవచ్చని అంతే తప్ప రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చూసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల సీలింగ్ పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాశంగా మారింది. కాగా మహారాష్ట్రలో వచ్చే జనవరి వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని గతంలో సుప్రీంకోర్టు ఈసీ అధికారులను ఆదేశించించింది.

EDITORIAL సంపాదకీయం

## రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై

# ట్రంపిజం

### చైనా, భారత్ లే టార్గెట్.. రష్యాను ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలు

తమ దేశంలో పరిస్థితులు అల్లకల్లోలంగా మారుతున్నా ట్రంప్ వ్యక్తిగత ప్రయోజనాలే తప్ప దేశ ప్రయోజనాలు ఆలోచించడం లేదని సొంత దేశంతో పాటు ఇంటా బయట విమర్శలు వినిపిస్తున్నాయి. రష్యాతో వ్యాపార,వాణిజ్యాలు చేస్తున్న అన్ని దేశాలపై అతి తీవ్ర ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇపుడు మళ్ళీ హెచ్చరిస్తున్నారు. రష్యా నుంచి ముడి చమురును కొనే, దాన్ని రీసేల్ చేసే దేశాలపై 500 శాతం దాకా సుంకాలను విధిస్తామని ఆయన వెల్లడించారు. ఈమేరకు కఠిన ప్రతిపాదనలతో కూడిన ఓ బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టిందని తెలిపారు. ఒకవేళ ఆ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోద ముద్ర లభిస్తే, తాను స్వాగతిస్తానని ట్రంప్ చెప్పారు. 500 శాతం సుంకాలను ఎదుర్కొనే దేశాల జాబితాలో ఇరాన్‌ను చేర్చాలని తాను సూచించానని, తప్పకుండా ఆ దేశాన్ని జాబితాలో చేరుస్తారని పేర్కొన్నారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయగా, ట్రంప్ తీరుపై వివిధ దేశాలు భగ్గుమంటున్నాయి. రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే ప్రతిపాదనతో కూడిన బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ సెనేటర్ లిండ్సే గ్రాహం, విపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంథాల్ కలిసి అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టారు.ఈ బిల్లు పేరు 'శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025'. 85 మంది సెనెటర్ల కనీస మద్దతుతో ఈ బిల్లును సెనెట్‌లో చర్చకు పెట్టారు. దీనికి సెనెట్‌లోని అత్యంత కీలకమైన 'విదేశీ సంబంధాల కమిటీ' ఏకగ్రీవ మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయి. ఈ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లభిస్తే, రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే అధికారం ప్రెసిడెంట్ ట్రంప్ చేతికొస్తుంది. ఈ అధికారంతో ప్రధానంగా చైనా, భారత్‌లను ట్రంప్ లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇరాన్, ఉత్తర కొరియాలాంటి దేశాలు కూడా ఆ జాబితాలో ఉంటాయి. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని చాలా భూభాగాన్ని రష్యా ఆర్మీ ఆక్రమించుకుంది. ఇప్పుడు తూర్పు ఉక్రెయిన్‌లోని కీలకమైన రైల్వే హబ్ 'పొక్రోవ్స్క్'ను స్వాధీనం చేసుకోవడంపై పుతిన్ సేనలు ఫోకస్ పెట్టాయి. గత కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భీకర వైమానిక దాడులను రష్యా చేస్తోంది. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలోని ముడి చమురు రిఫైనరీలపై దాడులు మొదలుపెట్టింది. ఈ యుద్ధం తీవ్రరూపు దాలుస్తున్న తరుణంలో రష్యా మిత్రదేశాలపై 500 శాతం సుంకాలను విధించే అధికార దండాన్ని సిద్ధం చేసుకోవడంపై ట్రంప్ ఫోకస్ చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలల క్రితమే అమెరికాలోని అలస్కా వేదికగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని, శాంతిని నెలకొల్పాలని సూచించారు. ఈ భేటీ తర్వాత ఉక్రెయిన్‌పై రష్యా దాడుల తీవ్రత మరింత పెరిగింది. దీంతో రష్యాతో, రష్యా మిత్రదేశాలతో కఠినంగా వ్యవహరిస్తేనే పరిస్థితులు అదుపులోకి వస్తాయనే అభిప్రాయానికి ట్రంప్ వచ్చారని పరిశీలకులు అంటున్నారు. ఈక్రమంలోనే రష్యాను ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలను వేగవంతం చేశారని చెబుతున్నారు. 500 శాతం సుంకాల అంశాన్ని ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.



## చైనా, భారత్‌లే టార్గెట్

ఈ ఏడాది జులైలో సెనెటర్లు లిండ్సే గ్రాహం(రిపబ్లికన్ పార్టీ), రిచర్డ్ బ్లూమెంథాల్ (డెమొక్రటిక్ పార్టీ) ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. రష్యా వాణిజ్య భాగస్వాములుగా ఉన్న చైనా, భారత్, బ్రెజిల్‌లపై భారీ సుంకాలను విధిస్తేనే, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందని వారు అభిప్రాయపడ్డారు. రష్యా మిత్రదేశాలను సుంకాలతో కట్టడి చేస్తేనే, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా సైన్యానికి ఆర్థిక వనరుల కొరత ఏర్పడుతుందన్నారు. రష్యా ఆర్థిక మూలాలను బలహీనపరిస్తేనే ఉక్రెయిన్‌పై దాడుల తీవ్రత తగ్గుతుందనే భావనలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం పలు దేశాలు వాణిజ్యం ద్వారా రష్యాకు ఆర్థిక వనరులను సమకూరుస్తూ పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధంలో భాగస్వామ్యం అవుతున్నాయని అమెరికా సర్కారు ఆరోపిస్తోంది. ఇప్పటికే భారత్‌పై 50 శాతం దిగుమతి సుంకాలను అమెరికా విధిస్తోంది. ఇందులో 25 శాతం సుంకాన్ని, కేవలం రష్యా నుంచి ఆయిల్‌ను కొంటున్నందుకే విధిస్తోంది. అయితే ఈ ఏడాది అక్టోబరులో ట్రంప్ మరో కీలక ప్రకటన చేశారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలును భారత్ చాలావరకు తగ్గించిందని ఆయన చెప్పారు. ఆ మేరకు భారత్‌పై విధించిన సుంకాలను తగ్గిస్తామన్నారు. ఓవైపు అమెరికా, మరోవైపు ఐరోపా దేశాలు రష్యాపై ఆంక్షలను అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ ఉక్రెయిన్‌పై దాడులను రష్యా ఆపడం లేదు. ఆసియాలోని పలు పెద్ద దేశాలతో వాణిజ్య సంబంధాల వల్లే రష్యా ఆర్థిక మూలాలు ఇప్పటికీ బలంగా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఇప్పుడు ఆ వాణిజ్య సంబంధాలను అడ్డుకునే ప్రయత్నాల్లో అమెరికా ఉంది. రకరకాల ప్రయత్నాలు చేసినా.. బెదిరింపులకు దిగినా చైనా, భారత్ లు డోన్ట్ కేర్ అంటున్నాయి. దీంతో ట్రంప్ వెర్రెత్తి విన్యాసాలు చేస్తున్నారు.





## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

mahaapatrika@gmail.com

whatsapp:

**74369 39999**

# బంగ్లాను ప్రగతిపథంలో నిలిపిన షేక్ హసీనా





షేక్ హసీనా.. బంగ్లాదేశ్ రాజకీయాలే కాదు ప్రపంచ రాజకీయాల్లోనే ప్రత్యేకం. అత్యధిక కాలం దేశాన్ని ఏలిన మహిళానేతగా, పవర్ ఫుల్ ఉమెన్ గా ఆమె రికార్డు పదిలం. బంగ్లాదేశ్ రాజకీయాల్లో మూడు దశాబ్దాలకు పైగా అత్యంత ప్రభావవంతమైన నేతగా.. ఉక్కు మహిళగా పేరు తెచ్చుకున్న షేక్ హసీనా జీవితం.. ఎన్నో సవాళ్ళు ఆటుపోట్లతో నిండి ఉంటుంది. బంగ్లాదేశ్‌కు 4 సార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన షేక్ హసీనాకు.. ఆమె సొంత దేశం సోమవారం అత్యంత అరుదైన, ఊహించని శిక్షను వేసింది. గతేడాది బంగ్లాదేశ్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక విద్యార్థుల ఉద్యమంలో భాగంగా ఆమె నేరం చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆమెను దోషిగా తేల్చి మరణశిక్ష విధించింది. 1947 సెప్టెంబర్ 28వ తేదీన షేక్ హసీనా జన్మించారు. బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తెనే ఈ షేక్ హసీనా. ఆమె ఢాకా యూనివర్సిటీలో బెంగాలీ సాహిత్యంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. అప్పుడే విద్యార్థి రాజకీయాల్లో ఆమె పాల్గొన్నారు. 1968లో అణు శాస్త్రవేత్త ఎం.ఎ.వాజెద్ మియాను షేక్ హసీనా పెళ్లి చేసుకున్నారు. 2009లో ఆయన చనిపోయే వరకు ఆమె వెంటే ఉన్నారు. వారికి సజీబ్ వాజెద్ జాయ్ అనే కుమారుడు, సైమా వాజెద్ పుతుల్ అనే కుమార్తె ఉన్నారు. 1975 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో జరిగిన సైనిక తిరుగుబాటులో ఆమె తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌తోపాటు.. తల్లి, ముగ్గురు సోదరులు సహా కుటుంబ సభ్యులు మొత్తం దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో విదేశాల్లో ఉన్న షేక్ హసీనా, ఆమె చెల్లెలు రెహానా మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.

### నాడు ఇందిరాగాంధీ భారత్ ఆశ్రయం

ఆ సమయంలో భారత ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ.. షేక్ హసీనాకు మన దేశంలో ఆశ్రయం కల్పించారు. 6 సంవత్సరాల తర్వాత.. 1981 మే నెలలో షేక్ హసీనా తిరిగి బంగ్లాదేశ్ లో అడుగు పెట్టారు. ఆమె రాకకు ముందే అవామీ లీగ్ జనరల్ సెక్రటరీగా ఆ పార్టీ నేతలు ఎన్నికున్నారు. ఇక బంగ్లాదేశ్ రాజకీయాలు 3 దశాబ్దాలకు పైగా షేక్ హసీనా, ఆమె రాజకీయ ప్రత్యర్థి ఖలీదా జియా (బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భార్య) మధ్య జరిగిన పోరాటాల చుట్టూనే తిరిగాయి. ఈ ఇద్దరు మహిళా నేతలను 'ది బ్యాట్లింగ్ బేగమ్స్' అని పిలిచేవారు. మొట్టమొదటిసారి షేక్ హసీనా 1996లో బంగ్లాదేశ్ ప్రధానమంత్రి అయ్యారు. ఆ తర్వాత 2001లో అధికారానికి దూరమయ్యారు. అనంతరం 2008లో భారీ విజయం సాధించిన తర్వాత.. వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఆమె ఏకధాటిగా 2014, 2018 ఎన్నికల్లో గెలిచి.. ప్రపంచంలోనే ఎక్కువ కాలం పనిచేసిన మహిళా నేతగా రికార్డుల్లోకి ఎక్కారు.

### బంగ్లాదేశ్ వేగవంతమైన ఆర్థిక వృద్ధి

తన పాలనలో బంగ్లాదేశ్ వేగవంతమైన ఆర్థిక వృద్ధిని.. పద్మా వంతెన వంటి భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధిని షేక్ హసీనా విజయవంతంగా చేశారు. పేదరిక నిర్మూలనలో బంగ్లాదేశ్ కీలక పురోగతిని చూసింది. ప్రపంచవ్యాప్తంగా దుస్తులను ఎగుమతి చేస్తూ.. గ్లోబల్ గార్మెంట్ పవర్‌హౌస్‌గా బంగ్లాదేశ్ ఎదిగింది. అయితే ఆమె ఇలాంటి విజయాలతో పాటు.. ఎంతో అపఖ్యాతిని కూడా మూటగట్టుకున్నారు. తన ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతను అణచివేయడం.. మీడియాపై ఆంక్షలు విధించడం.. ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం వంటి నిరంకుశ ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల నిరసనలు.. దేశవ్యాప్తంగా షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద తిరుగుబాటుగా మారాయి. నిరసనకారులను అణిచివేసేందుకు చేపట్టిన చర్యలు తీవ్ర హింసకు దారితీయడంతో.. షేక్ హసీనా అధికారాన్ని కోల్పోయి.. భారత్‌లోకి పారిపోయి వచ్చి తలదాచుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అక్కడ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో షేక్ హసీనా ఒకప్పుడు యుద్ధ నేరస్థుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్‌ను పునర్నిర్మించింది. అదే కోర్టు ఇపుడు శిక్ష విధించింది.

- మహా డెస్క్

## ఇందిరమ్మ లబ్దిదారుడి గృహప్రవేశం

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు**



**ఆదిలాబాద్ మహా :** సాత్నాల మండలం మేడిగూడ (ఆర్) గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు ఏనుగు వెంకట్ రెడ్డి దంపతుల నూతన గృహ ప్రవేశానికి స్థానిక కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు రిబ్బన్ కట్ చేసి దంపతులచే నూతన గృహ ప్రవేశం చేయించారు.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కృషితో గ్రామానికి 29 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు.ఇందులో కొన్ని పలు దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు.ఇంటిస్థలం ఉన్నవారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తుందని తెలిపారు.గతంలో ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రమే అన్నారు.ఈ కార్యక్రమంలో గౌతమ్ రెడ్డి ,రవీందర్ రెడ్డి, క్యాతం శివప్రసాద్ రెడ్డి ,భూమన్న, శామ్, అల్చేట్టి నాగన్న, షకీల్, కయ్యుమ్, వసంత్,తుదుం రాములు తదితరులు పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డి చొరవతో సమస్యలకు పరిష్కారం

**జహీర్ రంజానీ**



**ఆదిలాబాద్ మహా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని అన్నారు. సోమవారం ఆయన 29 వ వార్డులోని బొక్కల్ గూడా ప్రాంతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు , తాగునీటి సరఫరా అంశాలను ఆయన పరిశీలించారు. గతంలో ఈ పనులు ఉద్దేశపూర్వకంగా నిలిపివేయబడ్డాయని ఆయన ఆరోపించారు. అయితే కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి చొరవతో ఈ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని అన్నారు.ప్రజా సేవే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. ఎక్కడైనా మౌలిక సదుపాయాలు లేని కాలనీ వాసులు తమ సమస్యలపై కంది శ్రీనివాస రెడ్డి క్యాంప్ ఆఫీసులో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ఖానాపూర్ కాలనీని కూడా సందర్శించి అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో వైభవంగా పడిపూజ మహోత్సవం



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణం అయ్యప్ప దేవాలయంలో ప్రథమ మండల పూజ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా అయ్యప్ప స్వాముల దీక్షాపరులు, భక్తజనుల మధ్యలో సోమవారం సాయంత్రం పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఏడు గంటల నుండి ఆలయానికి చేరుకొని అయ్యప్ప నామస్మరణతోను, అయ్యప్ప శరణు ఘోషతో మారింది. ఈ సందర్భంగా ఆలయంలో భక్త జనులు అయ్యప్ప కీర్తనాలను పాటలతో అయ్యప్పను కీర్తించారు. ఆలయ ప్రధానఅర్చకులు కుటుంబరావు వేద మంత్రోచ్చారణల మధ్య అయ్యప్పకు శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చారణల మధ్య పూజాధి కార్యక్రమాలు నిర్వహించగా బీజేపీ మంచిర్యాల జిల్లా నాయకులు కోడి రమేష్ దంపతులు పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్పకు తేనే, పాలు, పెరుగు, నెయ్యితో పాటు పలు రకాల పండ్లతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా పలువురు అయ్యప్ప స్వాములు అయ్యప్ప గీతాల ఆలాపనలు చేయడంతో భక్తులు పరవశించిపోయారు. అనంతరం కన్నె స్వాములు ఆలయంలోని పలు ఉప ఆలయాలలోనే దేవతలకు పూలతో అర్చన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పదునెట్టాంబడి కార్యక్రమంలో భాగంగా ఆలయంలోని పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూరం జ్యోతులను ప్రజ్వలింప చేశారు. ఆలయంలో పూజాధి కార్యక్రమాలు ముగిసిన అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అయ్యప్ప స్వాములకు అందజేయడం జరిగింది. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అయ్యప్ప స్వాములకు దేవాలయ కమిటీ ఏర్పాటు చేసిన అల్పాహారంను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు సాంబశివరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరాల రాజమల్లు, ప్రధాన కార్యదర్శి పోతరాజు మంగమూర్తి ఆలయ కమిటీ సభ్యులు ఉడుత రాజన్న, బడికల లక్ష్మణ్,రంగాచారి,ఆలయ కమిటీ సభ్యులు తొంగలసత్యనారాయణ, భక్తులు అయ్యప్ప మాల ధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## నేచురోపతి చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**

**మంచిర్యాల, మహా :** నేచురోపతి చికిత్స ద్వారా దీర్ఘ కాలిక వ్యాధుల నియంత్రణ జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)పి చంద్రయ్య అన్నారు. సోమవారం 8వ జాతీయ నేచురోపతి దినోత్సవను సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మైత్రి యోగా అండ్ నేచర్ కేర్ సెంటర్ మంచిర్యా, సత్వ - నేచర్ కేర్, యోగా, ఆయుర్వేద రిట్రీట్ చెన్నూర్ సమన్వయంతో జిల్లా అధికారులకు ఏర్పాటు చేసిన నేచురోపతి అవగాహన కార్యక్రమానికి మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనప కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలికి నేచురోపతి ఎంతో ఉపయోగకరమైనదని తెలిపారు. నేచురోపతి చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు, ఒత్తిడి సమస్యలను నియంత్రించవచ్చని వివరించారు. మానవ జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమైనదని స్పష్టం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలినికి అవలంబిస్తూ సంతోషంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు, నేచురోపతి-యోగా వైద్యురాలు డాక్టర్ పోటు సమీర రెడ్డి మాట్లాడుతూ నేచురోపతి సహజమైన, సురక్షితమైన, శాశ్వత ఆరోగ్యాన్ని అందించే పద్ధతి అని, అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సుకుమార్, కె.ఎన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** వివిధ ప్రభుత్వ శాఖల సమస్యల పరిష్కారం కొరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి వచ్చే అర్జిదారుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం వేలాల గ్రామానికి చెందిన గుండోజు రాజేందర్ తాను సాదాబైనమా ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన నాగవత్ కమల తాను సమ్మర్ క్యాంప్ లో పాఠశాల తరగతులు చెప్పానని, వేతనం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని శివాజీ బాండ్ రోడ్ కాలనీ వాసులు దరఖాస్తులో తమ వార్డులో త్రాగునీటి సరఫరా సమయాన్ని ఉదయం 3.45 గంటల నుండి ఉదయం 6 గంటలకు మార్చవలసిందిగా కోరారు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన జంశెట్టి బొందయ్య తన ఇంటికి గృహ జ్యోతి పథకం వర్తింపచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కాసిపేటకు చెందిన దుర్గం చంద్రయ్య సింగరేణి సంస్థ కొరకు తీసుకున్న తన భూమికి సంబంధించి ఆలస్యమైన పరిహారంపై వడ్డీ చెల్లించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ కు చెందిన ఇష్రత్ సుల్తానా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన షేక్ బాబర్ తన తాతల నుండి వచ్చిన భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేసి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 27 దరఖాస్తులు అందాయని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అధ్యాపక క్యాడర్ రేషియో అమలు చేయాలి

**టిఎస్టిసిప రాష్ట్ర అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకుల వయస్సు 60 65 సంవత్సరాలకి ఉండే విధంగా జేఎన్టీయూహెచ్, ఓయూ అధికారులు ప్రైవేట్ సాంకేతిక కాలేజీలకి ఆదేశాలు జారీ చేయాలని టిఎస్టిసిపి రాష్ట్ర అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలలో పనిచేసే అధ్యాపకులకి రాష్ట్ర ప్రభుత్వం 28012025 రోజున, జీవో ఎంఎస్ 3 జారీ చేస్తూ, అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు పొడిగించింది. దీనిని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆయా శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ మన జేఎన్టీయూహెచ్, ఓయూ పరిధిలో ఉన్న కాలేజీలలో అది అమలు కావడం లేదు. దీనితో ఎంతో ఉన్నత అనుభవ నైపుణ్యాలు కలిగిన అధ్యాపకులు వాళ్ళ వృత్తికి దూరం అవుతున్నారు. వాళ్ళ యొక్క ఉన్నత అర్హత ప్రమాణాలను కోల్పోతున్నారు. కాబట్టి యూనివర్సిటీ అధికారులు జీవో నెంబర్ 3కు అనుగుణంగా అన్ని విద్యా సంస్థలలో అధ్యాపకులకు 60 65 సంవత్సరాల వరకు పొడిగించింది. దీనిని అన్ని ఉన్నత సాంకేతిక విద్యా సంస్థలలో అమలు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని జేఎన్టీయూహెచ్ విసికి, రిజిస్టర్ కు, ఉస్మానియా యూనివర్సిటీ విసికి, రిజిస్టర్ కు వినతి పత్రం పంపడం జరిగింది. సానుకూలంగా స్పందించిన జేఎన్టీయూహెచ్, రిజిస్ట్రార్ అధ్యాపకులకు సరియైన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## మొదలైన నాగన్ పల్లి రోడ్డు వెడల్పు పనులు



- ఎమ్మెల్యే రంగారెడ్డి చొరవతో పనులు ప్రారంభం
- అనతి కాలంలో ప్రజలకు అందుబాటులో రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నాగన్ పల్లి వెళ్లే రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్ పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వెడల్పు పనులకు, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చొరవతో, నిధులు కేటాయించడంతో రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డు చిన్నది కావడంతో, రెండు రహదారులను కలిపే లింకు రోడ్డు కావడంతో, భారీ వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ప్రమాదాలు తరచూ జరుగుతూ ఉన్నాయి. ఈ యొక్క రోడ్డు వెడల్పు పనులు పూర్తి అయితే అటుగా వెళ్లే నాగన్ పల్లి, పోల్కంపల్లి, నెర్రపల్లి, బాటసింగారం, కొత్తగూడ గ్రామాల ప్రజలకు, ఈ యొక్క రోడ్డు సౌకర్యంగా ఉపయోగంలోకి వస్తుంది. రోడ్డు పనులు పూర్తయిన పిమ్మట విజయవాడ హైవే నుండి నాగార్జున సాగర్ రహదారికి అనుసంధానం అవుతుంది. దీంతో సుమారు 10 నుంచి 20 కిలోమీటర్ల దూరాన్ని తగ్గిస్తుందని, వాణిజ్య రవాణాకు సౌలభ్యంగా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపడంతో, ఈ యొక్క రోడ్డు పనులను శరవేగంగా కొనసాగుతున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన ప్రజలు

**నాగన్ పల్లి, పోల్కంపల్లి, నెర్రపల్లి గ్రామాల ప్రజలు, ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసి ఇబ్రహీంపట్నం నాగన్ పల్లి రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడంతో, అధికారులను ఆదేశించి టెండర్ వేయించి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగింది. దీంతో రోడ్డు వెడల్పు పనులు కొనసాగుతున్నాయి. అనతి కాలంలో రోడ్డు ప్రజలకు అందుబాటులో వస్తుంది.**



## బుగ్గ ఆలయానికి వెండి నామాలు నాగాభరణం ప్రధానం

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి పట్టణానికి సమీపంలోని కన్నాలగ్రామపంచాయతీలో వెలిసిన స్వయంభు బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని రాజరాజేశ్వరుడికి కార్తీక సోమవారం చివరి రోజున బెల్లంపల్లి పట్టణానికి చెందిన మెరుగు గణేష్ స్రవంతి దంపతులు వారి కుటుంబ సభ్యులు వెండి నామాలు మరియు నాగాభరణములు ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో రాజరాజేశ్వరుడికి ప్రధానం చేశారు. ప్రధానం చేసిన వెండి ఆభరణాల విలువ రూ.1,21,615 /ఉంటుందని ప్రధాన చేసిన మెరుగు గణేష్ తెలిపారు. వెండి నాగాభరణం బరువు 723 గ్రాములు కాగా వెండినామాల బరువు 30 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. ఆభరణాలను అప్పగించిన వారిలో మెరుగు గణేష్ దంపతులతో పాటు మెరుగు మోక్షిత్ శశింద్ర, మెరుగు రాజేశం విజయలక్ష్మి,మెరుగురాజు యమున, మెరుగు శ్రీనివాస్ భవాని దంపతులు ఆలయ అర్చకులు సతీష్ శర్మతోపాటు దేవాలయ కార్యనిర్వహణాధికారి పాల్గొన్నారు.

## ఓట్ చోరీ మహా నిరసనలో పాల్గొన్న బోథ్ నాయకులు




**బోథ్ మహా :** ఓటు చోరీ కి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ హైదరాబాద్ గాంధీ భవన్ వద్ద నిర్వహించిన మహా నిరసన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతరెడ్డి తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవడానికి ఓట్లు దోచుకునే బీజేపీ, దానికి వత్తాసు పలికే ఎన్నికల కమిషన్ కుట్రలకు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ నాయకులు తమ స్వరం వినిపించాలని ఓట్ చోరికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు.

## సి.ఎం.పి.ఎఫ్ పెన్షనర్ల కొరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్




**మందమర్రి, మహా:** :సి.ఎం.పి.ఎఫ్ పెన్షనర్ల కొరకు మందమర్రి సి ఈఆర్ క్లబ్ లో రెండు రోజుల డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ ను మందమర్రి జీఎం రాధాకృష్ణ, పీఎం శ్యాంసుందర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన్ ప్రమాన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ గురించి మందమర్రి ఏరియాలో సోమ, మంగళవారంలలో కార్మికుల సౌకర్యార్థం కొరకు సీఎంపీఎఫ్ఓ గోదావరిఖని అధికారులచే జీవన్ ప్రమాన్ పునరుద్ధరన పై క్యాంపు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో జీవన్ ప్రమాన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఆన్ లైన్ లో పునరుద్ధరణ చేస్తారని చెప్పారు. మాజీ సింగరేణి ఉద్యోగులు వారి యొక్క పి.పి.ఓ. కాపీ, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ తో లింక్ ఉన్న మొబైల్ నెంబర్ తీసుకుని ఈ క్యాంప్ లో పాల్గొనాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం ఏ.ఐ.టీ.యూ.సీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్-2 గోవర్దన్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, అన్ని గనుల సంక్షేమ అధికారులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



**బెల్లంపల్లిలో అయ్యప్ప దేవాలయంలో**

## ప్రథమ మండల పూజ మహోత్సవం

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోనీ అయ్యప్ప దేవాలయంలో ప్రధాన మండల పూజ మహోత్సవాన్ని సోమవారం భక్తులు, అయ్యప్ప స్వాములు సమక్షంలో ప్రథమ మండల పూజా మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు హాజరు కాగాఅయ్యప్ప స్వాములుసైతం అధిక సంఖ్యలో పాల్గొని మండల పూజా మహోత్సవాన్ని తిలకించారు. సోమవారం ఉదయం గణపతి హోమం తోపాటు ధ్వజారోహణ కార్యక్రమాన్ని అయ్యప్ప స్వాముల సమక్షంలో ఆలయ అర్చకులు కుటుంబరావు దేవాలయ కమిటీ అధ్యక్షులు పేరాల రాజమల్లు, ప్రధాన కార్యదర్శి పోతరాజు మంగమూర్తి తోపాటు ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా సాయంకాలం పడిపూజ మహోత్సవ కార్యక్రమం నకు సంబంధించిన సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి పోతరాజు మంగమూర్తి, ఉపాధ్యక్షులు సభ్యులు ఉడుత రాజన్న ,బడికెల లక్ష్మణ్, తొంగల సత్యనారాయణ కోడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## షాపులో ఎమ్మార్వో తనిఖీలు

**బోథ్ మహా :** బోథ్ నియోజకవర్గంలోని సోనాల మండలంలో అనుమతులు లేకుండా మొక్క జొన్న, పత్తి, సోయాబీన్ కొనుగోలు చేస్తున్న షాపును ఎమ్మార్వో ఇమ్రాన్ ఖాన్ తనిఖీ చేసారు. గోపాల్ అనే వ్యక్తి కి చెందిన షాపులో 58 బస్తాల మొక్కజొన్నలు 60 కిలోల పత్తిని సీజ్ చేసి బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ కి అప్పగించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొనబడుతాయని హెచ్చరించారు. అలాగే ఘనపూర్ అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ను సందర్శించి తగు సూచనలు చేసారు.

## డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని మార్చవద్దు



**ఆదిలాబాద్ మహా:** జిల్లాలోని బేల మండల కేంద్రంలో కేయూ డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బేల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ లో అంతరాష్ట్ర రహదారిపై ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్ రెడ్డి మాట్లాడుతూ..బేలలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా కేంద్రానికి మార్చడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ,అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు 45 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉందని కేయూ అధికారులు మా ఇబ్బందులు గుర్తించి పరీక్ష కేంద్రాన్ని బేలలో యథావిధిగా కొనసాగించాలన్నారు.వెంటనే స్పందించిన తహసీల్దార్ రఘునాథ్ రావ్.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రేసు మనోజ్ రెడ్డి,తరుణ్, కుర్మా పవన్ రెడ్డి, కన్నె సాయి రెడ్డి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ అక్క కార్యక్రమం



**ఆదిలాబాద్ మహా :** బాలికలు గొప్ప లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని కష్టపడి సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈరోజు మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ చౌరస్తానందుగల బాలికల జూనియర్ కళాశాల నందు ఏర్పాటుచేసిన పోలీసు అక్క కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేసారు. విద్యార్థినులు జిల్లా ఎస్పీ పనితీరుపై ప్రశంసల వర్షం కురిపించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జిల్లా ప్రశాంతంగా ఉండేలా నిర్వహిస్తున్న తీరును కొనియాడారు. రౌడీల పట్ల, ప్రజలను మోసం చేస్తున్న నేరగాళ్ల పట్ల, భూ కబ్జాదారుల పట్ల జిల్లా ఎస్పీ వ్యవహరిస్తున్న తీరును అభినందించారు. అఖిల్ మహాజన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం జిల్లాకు వరమని భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా 53 పోలీసు అక్క అనే కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, విద్యార్థులు ధైర్యంగా తమ సమస్యలను పోలీసు అక్క అనే తోబుట్టువుకు తెలియజేస్తున్నారని, జిల్లా పోలీసు యంత్రాంగం సత్వర చర్యలతో వారం రోజులలో 8 కేసులు పెట్టి నాలుగు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు రక్షణగా జిల్లా పోలీసు వ్యవస్థ ముందుందని తెలిపారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఉన్న నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. మహిళలకు రక్షణగా ఆదిలాబాద్ షీ టీం మరియు పోలీసు అక్క, జిల్లా పోలీసు వ్యవస్థ 24 గంటలు అందుబాటులో ఉంటాయని డయల్ 100 ద్వారా లేదా 8712659953 అనే నెంబర్ ద్వారా సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. మహిళలు విద్యార్థినులకు పాఠశాలల నందు, లేదా కళాశాల నందు, ఇంటికి వెళ్లే దారి మార్గంలోనైనా ఎలాంటి ఇబ్బందులకు, ఈవ్ టీజింగ్ కు గురైన ధైర్యంగా తెలియజేయాలని సూచించారు. మహిళలకు మహిళల పట్ల ఉన్న చట్టాలు, ఫోక్సో చట్టం అంశాలపై సవివరంగా వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా, వాహన నియమ నిబంధనలు పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఎంచుకున్న ఏ ఏ రంగంలోనైనా కష్టపడితే ఆ రంగంలో ఉన్నత శిఖరాలకు అందుకోవచ్చని, ఎంచుకున్న రంగం ఉత్తమమైనదిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఐ ఈ ఓ జాదవ్ గణేష్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, కళాశాల ప్రధానోపాధ్యాయుడు సూరత్ సింగ్, షీటీం బృందం, పోలీసు అక్క, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను ఉల్లంఘించిన 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం

**మందమర్రి ఎస్సై రాజశేఖర్**



**మందమర్రి, మహా :** రోడ్డు భద్రత నిబంధనలను ఉల్లంఘించిన 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారిపై గత నాలుగు రోజులుగా బురద గూడెం, అందుగులపేట జాతీయ రహదారిపై రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్న వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ డ్రైవ్ లో నిబంధనలను ఉల్లంఘించిన 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలపై తదుపరి చట్టపరమైన చర్యల కోసం మంచిర్యాల ఆర్టీవో (ప్రాంతీయ రవాణా అధికారి) కార్యాలయానికి పంపిస్తామని వెల్లడించారు. రామగుండం సీపీ అంబార్ కిషోర్ ఝ ఆదేశాల మేరకు సోమవారం మందమర్రి సర్కిల్ లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలు తమతో పాటు ఇతరుల భద్రత కోసం తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ జరగాలంటే ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత సూత్రాలను పాటించాలని ఆయన కోరారు.

## వయోవృద్ధుల ర్యాలీ




**ఆదిలాబాద్ మహా:** వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం నుంచి జగ్జీవన్ రామ్ చౌక్ వరకు వయోవృద్ధుల నడక ర్యాలీ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి మిల్కా ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.జిల్లా వయోవృద్ధుల సమాఖ్య సభ్యులు, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి ర్యాలీ లో పలు విషయాలపై అవగాహన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి జే. శ్రీనివాస్, అధికారులు యశోద, జిల్లా సమైక్య అసోసియేట్ అధ్యక్షులు గంగాధర్, సభ్యులు దయాకర్ రెడ్డి, ఈ. ప్రకాష్, శ్యామ్ రాజ్ గౌడ్, ఆర్. కిషోర్, దేవన్న, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## హిందుస్థాన్ జింక్‌కు టంగ్‌స్టన్ అన్వేషణ లైసెన్స్




**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో టంగ్‌స్టన్ బ్లాక్‌ను అన్వేషించేందుకు, తవ్వకాలు చేపట్టేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందినట్లు హిందుస్థాన్ జింక్ తెలిపింది. ఆధునిక తయారీ పరికరాల్లో వినియోగించే విలువైన ఖనిజాల వెలికితీత వ్యాపారాల్లోకి ప్రవేశించాలని భావిస్తున్న వేదాంత గ్రూప్‌నకు ఇదొక కీలక మైలురాయి. "ఆంధ్రప్రదేశ్‌లో టంగ్‌స్టన్, సంబంధిత ఖనిజ బ్లాక్‌ను టెండర్‌లో దక్కించుకున్నాము. ఇందుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం నుంచి కాంపోజిట్ (అన్వేషణ, తవ్వకాలు) లైసెన్స్ పొందాము" అని కంపెనీ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. క్రిటికల్, వ్యూహాత్మక ఖనిజాల్లో దేశం స్వయం ప్రతిపత్తిని సాధించడంతో తమ వంతు పాత్ర పోషిస్తామని కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా తెలిపారు. హిందుస్థాన్ జింక్‌లోనే అతిపెద్ద జింక్ ఉత్పత్తిదారు. వెండి ఉత్పత్తి చేసే తొలి అయిదు సిల్వర్ ఉత్పత్తిదారుల్లో స్థానం దక్కించుకుంది. దాదాపు 40కి పైగా దేశాలకు వెండిని సరఫరా చేస్తుంది. దేశీయ జింక్ మార్కెట్‌లో 77 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగి ఉంది.

## మెరుగైన రాబడి కోసం.. మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్




మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి పెట్టుబడులపై మెరుగైన రాబడి కోరుకునే ఇన్వెస్టర్ల ముందున్న ఎంపికల్లో మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ కూడా ఒకటి. వీటిల్లో రిస్క్ అధికం. రాబడి కూడా అధికంగానే ఉంటుంది. లార్జ్‌క్యాప్ కంటే దీర్ఘకాలంలో అదనపు రాబడి మిడ్‌క్యాప్ ఫండ్స్‌తో సాధ్యపడుతుందని గత గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ విభాగంలో క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది. పదేళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు ఈ పథకంలో పెట్టుబడులను పరిశీలించొచ్చు.

**రాబడులు**

స్వల్పకాలం నుంచి దీర్ఘకాలంలోనూ ఈ పథకంలో పనితీరు మెరుగ్గా ఉండడం కనిపిస్తుంది. ముఖ్యంగా గత ఏడాది కాలంలో ఈ పథకం ఎలాంటి రాబడిని ఇవ్వలేదు. అదే సమయంలో నష్టాలను మిగల్చలేదు. గడిచిన ఏడాది కాలంలో ఈక్విటీలు దిద్దుబాటు దశలో ఉండడం తెలిసిందే ఇది మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ రాబడులు పటిష్ఠంగా ఉన్నాయి. మూడేళ్లలో చూస్తే ఏటా 18 శాతం చొప్పున డైరెక్ట్ ప్లాన్‌లో రాబడి నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 28 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇక ఏడేళ్ల కాలంలో 23 శాతం, పదేళ్లలోనూ 18.34 శాతం చొప్పున రాబడి తెచ్చిపెట్టింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ టీఆర్ఐ సూచీతో పోల్చి చూస్తే ఐదేళ్లు, ఏడేళ్లలో అదనపు రాబడి ఇచ్చింది. పదేళ్ల కాలంలోనూ సూచీతో సమాన రాబడిని అందించింది. ముఖ్యంగా గడిచిన ఐదేళ్ల కాలంలో ఏ ఏడాది కూడా ఈ పథకం నికరంగా నష్టాలను ఇవ్వలేదు.

**పెట్టుబడుల విధానం**

ఇది యాక్టివ్ ఫండ్. అంటే ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తుంటుంది. మార్కెట్, రంగాల వారీ పరిస్థితులు, పెట్టుబడుల అవకాశాలకు అనుగుణంగా పోర్ట్‌ఫోలియోలో కొత్త స్టాక్స్‌ను చేర్చుకోవడం, ప్రస్తుత స్టాక్స్‌లో ఎక్స్‌పోజర్ తగ్గించుకోవడం, పూర్తిగా వైదొలగడం వంటి బాధ్యలను ఫండ్ పరిశోధక బృందం ఎప్పటికప్పుడు చేస్తుంటుంది. ముఖ్యంగా ఏదో ఒక విధానానికి పరిమితం కాబోదు. మూమెంటమ్, వ్యాల్యూ, గ్రోత్ ఇలా అన్ని రకాల విధానాల్లోనూ పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం పరిశీలిస్తుంటుంది. అవకాశాలకు అనుగుణంగా పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది.

### పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.8,525 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 90.52 శాతం పెట్టుబడులను ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సెక్యూరిటీల్లో 2.8 శాతం పెట్టుబడులు పెట్టింది. 6.68 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. ముఖ్యంగా ఈక్విటీ పోర్ట్‌ఫోలియోని గమనించినట్టయితే మొత్తం 29 స్టాక్స్ ఉన్నాయి. టాప్–10 స్టాక్స్‌లోనే 58 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే.. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 59 శాతం ఇన్వెస్ట్ చేసింది. అదే సమయంలో 29 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెన్లీలో ఇన్వెస్ట్ చేసింది. లార్జ్‌క్యాప్ పెట్టుబడులు రిస్క్‌ను తగ్గిస్తాయి. మిడ్‌క్యాప్ పెట్టుబడులు మెరుగైన రాబడులకు అవకాశం కల్పిస్తాయని అర్థం చేసుకోవచ్చు. ఇంధన రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 18 శాతం పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఇండ్రస్టియల్స్ కంపెనీలకు 16.71 శాతం, హెల్త్ కేర్ కంపెనీలకు 15.30 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 11.22 శాతం చొప్పన కేటాయింపులు చేసింది.

## టెక్ కంపెనీ కొత్త చర్య..
### భయపడుతున్న ఐటీ ఉద్యోగులు!



ఉద్యోగాలు పోతాయేమో అని ఉద్యోగులు భయపడుతున్న వేళ.. ప్రముఖ ఐటీ కంపెనీ చర్య వారిలో మరింత ఆందోళన కలిగిస్తోంది. కాగ్నిజెంట్ కంపెనీ ఉద్యోగులు తమ ల్యాప్‌టాప్‌లలో ఎంతసేపు యాక్టివ్‌గా ఉంటున్నారు, పని సమయంలో వారు ఏ అప్లికేషన్‌లు లేదా వెబ్‌సైట్‌లను ఉపయోగిస్తారో ట్రాక్ చేయడానికి సిద్ధమైంది. దీనికోసం సంస్థ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రోహ్యాన్స్ వంటి వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ సాధనాలను ఉపయోగించనున్నట్లు, దీనికోసం ఎంపిక చేసిన ఎగ్జిక్యూటివ్‌లకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించినట్లు సమాచారం. కొత్త టెక్నాలజీ మాడ్యూల్.. మౌస్, కీబోర్డ్ కార్యకలాపాలను రికార్డ్ చేస్తుంది. తద్వారా ఎంప్లాయిస్ ఎంతసేపు పనిచేయకుండా ఉన్నారో ఇట్టే తెలిసిపోతుంది. 5 నిమిషాలు పనిచేయకుండా ఉంటే.. అలాంటి ఉద్యోగిని 'ఐడిల్' అని ట్యాగ్ చేయనున్నట్లు, ల్యాప్‌టాప్ 15 నిమిషాల పాటు పనిచేయకుండా ఉంటే.. ఉద్యోగి సిస్టమ్ నుంచి దూరంగా ఉండి, ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు గురిస్తారు. ప్రస్తుతం దీనిని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**పనితీరును ర్యాంక్ చేయడానికి కాదు**

ఈ కొత్త విధానం.. డేటా ప్రక్రియ దశలను అర్థం చేసుకోవడానికి, వినియోగాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించబడిందని కంపెనీ ఉద్యోగులకు తెలిపింది. ఇది వ్యక్తిగత పనితీరును ర్యాంక్ చేయడానికి లేదా రేట్ చేయడానికి కాదని వెల్లడించింది. కానీ వర్క్ ఫ్రమ్ చేస్తున్న ఉద్యోగులపై నిఘా పెట్టడానికే ఇలాంటి కొత్త విధానాలను అమలు చేస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఇది ఉద్యోగులలో ఒత్తిడిని పెంచుతుందని అంటున్నారు.

**వర్క్ లైఫ్ బ్యాలెన్స్ దెబ్బతింటుంది!**

కాగ్నిజెంట్ చర్య వల్ల ఉద్యోగుల వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఇబ్బదుల్లో పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగులపై నమ్మకం లేనప్పుడే కంపెనీలు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటాయి. ల్యాప్‌టాప్ కదలికలను బట్టి ఉద్యోగి పనితీరును అంచనా వేయడం ఎంత వరకు కరెక్ట్ అని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇది కంపెనీ ఉద్యోగుల మధ్య ఉన్న సంబంధాన్ని దెబ్బ తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రూ.530 కోట్లతో అల్యూమినియం క్యాన్ల తయారీ ప్లాంట్ విస్తరణ



సస్టైనబుల్ అల్యూమినియం ప్యాకేజింగ్‌లో సర్వీసులు అందిస్తున్న బాల్ కార్పొరేషన్ భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముంబై సమీపంలోని తలోజా తయారీ కేంద్రానికి 2024లో చేసిన దాదాపు 55 మిలియన్ డాలర్ల(సుమారు రూ.480 కోట్లు) పెట్టుబడికి కొనసాగింపుగా బాల్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ సదుపాయంలో సుమారు 60 మిలియన్ డాలర్లు(సుమారు రూ.530 కోట్లు) ఇన్వెస్ట్ చేయబోతున్నట్లు తెలిపింది. దాంతో మొత్తంగా ఇండియాలో 115 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టినట్లవుతుంది. పానీయాలకు సంబంధించి అల్యూమినియం ప్యాకేజింగ్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి బాల్ కార్పొరేషన్ ప్రాంతీయ సరఫరా గొలుసును బలోపేతం చేయడంలో ఈ చర్యలు కీలకంగా ఉంటాయని కంపెనీ అధికారులు చెబుతున్నారు. 'ప్రపంచవ్యాప్తంగా కంపెనీ వృద్ధికి భారతదేశం కీలకం. ఈ పెట్టుబడి ఇండియాలో కార్యకలాపాలను మరింత పెంచడానికి, ప్రత్యర్థులతో దీర్ఘకాలిక పోటీ ప్రయోజనాన్ని పొందటానికి వీలు కల్పిస్తుంది' అని బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ ఆసియా ప్రెసిడెంట్ మాండీ గ్లూ అన్నారు. రాబోయే ఐదేళ్లలో భారతదేశపు పానీయాల మార్కెట్ వార్షికంగా 10% పైగా విస్తరిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్యాకేజింగ్‌లో సుస్థిరత, వినియోగదారుల సౌలభ్యం కోసం వివిధ పానీయాల బ్రాండ్లు అల్యూమినియం ప్యాకేజింగ్ వైపు మళ్లుతున్నాయి. ముఖ్యంగా రెడీ టు డ్రింక్ (RTD), పాల ఆధారిత పానీయాల్లో వీటి వాడకం ఎక్కువగా ఉంది. ఈ విభాగంలో మన్నిక, షెల్ఫ్ లైఫ్ పొడిగింపు కారణంగా అల్యూమినియం ప్యాకేజింగ్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. పాల విభాగంలో ప్యాకేజింగ్‌కు సంబంధించి కంపెనీ రిటార్ట్ ఇన్నోవేషన్ టెక్నాలజీని వాడుతున్నట్లు అధికారులు చెప్పారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 388.17 పాయింట్లు లేదా 0.46 శాతం లాభంతో 84,950.95 వద్ద, నిఫ్టీ 103.40 పాయింట్లు లేదా 0.40 శాతం లాభంతో 26,013.45 వద్ద నిలిచాయి. వీఎల్ఎస్ ఫైనాన్స్, బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ లిమిటెడ్, బన్నారి అమ్మన్ స్పిన్నింగ్ మిల్స్, ఎనర్జీ డెవలప్‌మెంట్ కంపెనీ, మాక్‌పవర్ CNC మెషీన్స్ లిమిటెడ్ కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో నిలిచాయి. వాస్వానీ ఇండస్ట్రీస్ లిమిటెడ్, గాబ్రియేల్ ఇండియా, సెక్యూర్‌క్లౌడ్ టెక్నాలజీస్, డెక్కన్ సిమెంట్స్, ఫిషర్ మెడికల్ వెంచర్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.



## నేనున్నా.. చూసుకుంటా: లాలూ ప్రసాద్ యాదవ్



**పట్నా:** తమ కుటుంబ సమస్యల్లో అతిగా జోక్యం చేసుకోవడం అనవసరపు చర్యగా అభివర్ణించారు ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్,. తమ కుటుంబ సమస్యలపై దృష్టి ఆపి ఎవరి పని వారి చేసుకుంటే మంచిదని హితవు పలికారు,. ప్రధానంగా పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ.. లాలూ ఫ్యామిలీ సమస్యలను పార్టీ వరకూ తీసుకెళ్లడం తగదన్నారు. అంతర్గత కలహాలపై కాకుండా, పార్టీ ఐక్యత , పార్టీ పనితీరును మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని కోరారు. ఇక్కడ పార్టీ అనేది ప్రధానంగా కాబట్టి కార్యకర్తలు ఆ వ్యవహారాలపై దృష్టి నిలపాలన్నారు. పార్టీని తిరిగి గాడిలో పెట్టడంపైనే కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. ' ఇది మా కుటుంబ సమస్య. ఆ సమస్యలను నేను డీల్ చేసుకుంటా. నేను ఉన్నా.. అంతా చూసుకుంటా' అని స్పష్టం చేశారు. పాట్నాలో జరిగిన పార్టీ శాసనసభ్యులసమావేశంలో తేజస్వి యాదవ్‌ను ఆర్జేడీ శాసనసభా పక్ష నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిలో భాగంగా లాలూ ప్రసాద్ యాదవ్ మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ రాష్ట్ర ప్రధాన పార్టీ ఆర్జేడీలో విస్తృత చీలికను తెచ్చిపెట్టింది. ప్రధానంగా ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో తీవ్ర ప్రకంపనాలు సృష్టిస్తోంది. ఇప్పటికే లాలూ రెండో కుమార్తె రోహిణి ఆచార్య ఇంటి నుంచి బయటకు వచ్చేయగా, మరో ముగ్గురు కుమార్తెలు సైతం అక్క బాటలోనే పయనించారు. లాలూకు ఉన్న ఏడుగురు కూతుళ్లలో ముగ్గురు రాజ్యలక్ష్మీ రాగిణి, చంద్రలు ఆ కుటుంబాన్ని వీడారు. వీరంతా తమ పిల్లలతో కలిసి ఢిల్లీకి వయల్దేరివెళ్లిపోయారు. రోహిణి శనివారం(నవంబర్ 15వ తేదీ) నాడు కుటుంబాన్ని వీడి వెళ్లిపోగా, ఇప్పుడు మరో ముగ్గురు కూతుళ్లు పట్నాలోని ఇంటి నుంచి వెళ్లిపోవడం లాలూకు తీవ్ర మనోవేధనకు గురిచేస్తోంది. ఒకవైపు పార్టీ ఘోరంగా ఓడిపోయిందనే అపదాదుతో పాటు, ఇప్పుడు కూతుళ్లు ఒకరి వెంట ఒకరు ఇంటిని విడిచి వెళ్లిపోవడం లాలూను మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పార్టీ శ్రేణులు కూడా లాలూ ప్రసాద్ కుటుంబం చీలికపై తీవ్ర దృష్టి నిలిపాయి. ఈ నేపథ్యంలోనే పార్టీ కార్యకర్తలకు లాలూ తనదైన శైలిలో దిశా నిర్దేశం చేస్తూ ..అంత సెట్ అవుతుందని, తమ కుటుంబ రచ్చ వ్యవహారంలోకి పోకుండా పార్టీని మెరుగుపరచడానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ఇక అమెరికా నుంచి ఎల్‌పీజీ గ్యాస్
### చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్న భారత చమురు కంపెనీలు
### వెల్లడించిన కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి



భారత్‌కు ఇక అమెరికా నుంచి ఎల్‌పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ ) దిగుమతి కానుంది. ఈమేరకు భారత ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు యూఎస్ ఉత్పత్తిదారులతో ఒప్పందం కుదుర్చుకున్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. 'ఇది చరిత్రలో తొలిసారి! అతిపెద్ద, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎల్‌పీజీ మార్కెట్లలో ఒకటైన భారత్ యునైటెడ్ స్టేట్స్‌కు తెరుచుకుంటోంది. భారత దేశ ప్రజలకు తక్కువ ఖర్చులో సురక్షితమైన ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాలను అందించే ప్రయత్నంలో భాగంగా ఎల్‌పీజీ సోర్సింగ్ ను వైవిధ్యభరితం చేస్తున్నాం. భారతీయ పీఎస్‌యూ చమురు కంపెనీలు ఒక సంవత్సరానికి దాదాపు 2.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేలా ఒప్పందాన్ని విజయవంతంగా కుదుర్చుకున్నాయి.' తన 'ఎక్స్' ఖాతా ద్వారా కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందం ప్రకారం.. 2026 సంవత్సరానికి గానూ 2.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ భారత ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు అమెరికా ఉత్పత్తిదారుల నుంచి దిగుమతి చేసుకోనున్నాయి. యూఎస్ గల్ఫ్ తీరం నుంచి దిగుమతి చేసుకోనున్న ఈ దిగుమతుల పరిమాణం భారతదేశ మొత్తం వార్షిక ఎల్‌పీజీ దిగుమతులలో 10 శాతం మేర ఉండనుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (IOCL), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL) బృందాలు ప్రధాన అమెరికన్ ఉత్పత్తిదారులతో చర్చలు జరపడానికి ఇటీవలి నెలల్లో అమెరికాను సందర్శించాయని, అవి ఇప్పుడు విజయవంతంగా ముగిశాయని ఆయన తెలిపారు.



## ఇక 1800పై బీజేపీ గురి!

బీజేపీ.. ఇటీవల బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు 202 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం కాగా, అందులో బీజేపీ 89 సీట్లతో దుమ్ములేపింది. ఇక మరో ఎన్డీఏ పక్షం జేడీయూ 85 సీట్లను సాధించి.. బీజేపీ కంటే వెనుకబడింది. దాంతో బిహార్‌లో బీజేపీ ప్రతిష్ఠ మరింత పెరిగింది. ఇదిలా ఉంచితే, 2004 నాటికి బీజేపీ ఓవరాల్ ఎమ్మెల్యేల సంఖ్య 1035 ఉండగా, నేటికి ఆ సంఖ్య మరింత ముందుకెళ్లింది. 2025 నాటికి బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య 1654గా ఉంది. ఈ విషయాన్నే బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ అమిత్ మాలవీయ హైలైట్ చేశారు. సోమవారం(నవంబర్ 17వ తేదీ) దేశవ్యాప్త అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఎలా తన ఉనికిని కాపాడుకుంటూ ముందుకెళుతుందనే విషయాన్ని ఆయన వెల్లడించారు. తాము ప్రస్తుతానికి సాధించిన సంఖ్య ఏదైతే ఉందో అది బీజేపీ రాజకీయ చరిత్రలో అత్యధికమన్నారు. మున్ముందు కూడా తమ పార్టీ వికాసం ఇలానే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారాయన. రాబోయే రెండేళ్లలో తమ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 1800కు చేరుతుందనే ధీమా వ్యక్తం చేశారు మాలవీయ.

| Year | BJP MLA Count |
|---|---|
| 2014 | 1035 |
| 2015 | 997 |
| 2016 | 1053 |
| 2017 | 1365 |
| 2018 | 1184 |
| 2019 | 1160 |
| 2020 | 1207 |
| 2021 | 1278 |
| 2022 | 1289 |
| 2023 | 1441 |
| 2024 | 1588 |
| 2025 | 1654 |

## థార్‌తో విసిగిపోయిన యజమాని చేసిన పని
# సోషల్ మీడియాలో వైరల్




**పూణే:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా థార్ ఎస్‌యూవీతో విసిగిపోయిన కారు యజమాని వినూత్నంగా నిరసన తెలిపాడు. థార్ కారుని ఇంటి నుంచి షోరూం వరకు గాడిదలతో తరలించారు. అలా అయినా మహీంద్రా ప్రతినిధులు స్పందించి తన సమస్యను పరిష్కరిస్తారేమోనని ఆశగా ఎదురు చూశాడు. ఆ తర్వాత ఏమైందంటే? థార్‌తో రోజుకో పుట్టుకొస్తున్న సమస్యలతో విసిగిపోయిన వ్యక్తి.. గాడిదలతో షోరూమ్‌కు లాగించిన ఘటన పూణేలో జరిగింది. అక్బర్ ఖాన్ మహీంద్రా థార్ (2023 మోడల్)ను కొనుగోలు చేశాడు. లక్షలు వెచ్చించి కారును కొనుగోలు చేశాడన్న మాటేగాని నిత్యం ఏదో ఒక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. నాటి నుంచి ఇంజిన్ సమస్యలు, బ్రేక్‌డౌన్ ఫెయిలవ్వడం షోరూంకి తీసుకుపోయి బాగు చేయించుకోవడం, వేలవేలకు వేలు ఖర్చు చేయడం. ఇలా పరిపాటిగా మారింది. అలా అని థార్ సమస్యలు తీరాయా? అంటే అదీ లేదు. కారులోని సమస్యలతో ఇబ్బంది పడుతున్నా బాగుచేయండి మహాప్రభూ అంటూ షోరూం ప్రతినిధులకు కారు యజమాని మొరపెట్టుకున్నా.. ఫలితం శూన్యం. ఈ క్రమంలో ఇంజిన్ సమస్యలు, బ్రేక్‌డౌన్‌లు తరచూ ఎదురవుతున్నాయని ఆరోపిస్తూ థార్ యజమాని కారును గాడిదలతో లాగించి షోరూమ్ ముందు ఉంచి తన అసంతృప్తిని వెళ్లగక్కాడు. దీంతో ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా థార్ ఓనర్ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ.. "థార్ వాహనం కొనుగోలు చేసిన తర్వాత ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. షోరూమ్‌కు ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. చివరికి గాడిదలతో లాగించి షోరూమ్ ముందు ఉంచి నా బాధను వెళ్లగక్కానని చెప్పుకొచ్చాడు. వీడియో వైరల్ కావడంపై షోరూమ్ ప్రతినిధులు స్పందిస్తూ, "వాహన యజమానిని సంప్రదించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని తెలిపారు. ఈ ఘటనపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. కొంతమంది యజమాని వినూత్న నిరసనను ప్రశంసిస్తుండగా, మరికొందరు కంపెనీపై విమర్శలు చేస్తున్నారు.

## ఢిల్లీ బాంబు పేలుళ్ల కేసులో కీలక నిందితుడి అరెస్ట్




ఢిల్లీ ఎర్రకోట బాంబు పేలుళ్ల కేసులో మరో ముందడుగు పడింది. బాంబు పేలుడికి సంబంధించి కారు బాంబు తయారు చేసిన జసీర్ బిలాల్ వని అలియాస్ డానిష్‌ని ఎన్ఐఏ బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. బాంబు తయారికి సంబంధించిన సాంకేతిక అంశాలు బిలాల్ అందించాడని ప్రధాన నిందితుడు ఉమర్ ఉన్ నబీతో కలిసి పనిచేశాడని ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన ఎర్రకోట బాంబు పేలుళ్ల ఘటనలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న జాసిర్ బిలాల్ వని అలియాస్ (డానిష్)ను ఎన్ఐఏ బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. బిలాల్ బాంబుదాడి జరగడానికి ముందు ఉగ్రవాదులకు సాంకేతిక సహాయం అందించాడని డ్రోన్ల ఆధునీకరణ, రాకెట్ లాంఛర్ల తయారీ వంటి విషయాలలో సహాయం అందించాడని పేర్కొంది. అంతేకాకుండా కారు బాంబు దాడికి ముందు ప్రధాన నిందితుడు ఉమర్‌కు ఎంతో సన్నిహితంగా మెదిలేవాడని పేలుళ్ల కేసులో సహ కుట్రదారుగా బిలాల్ వ్యవహరించాడని తెలిపింది. జాసిర్ బిలాల్ జమ్మూకశ్మీర్ అనంతనాగ్ జిల్లాకు చెందిన వాడని ఎన్ఐఏ తెలిపింది. కాగా ఎర్రకోట బాంబు పేలుళ్ల కేసులో ఇదివరకే షహీన్ సయీద్, మజమ్మిల్ షకీల్, ఆదిల్ రాథర్ అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ పేలుళ్లపై లోతైన విచారణ జరుపుతున్నామని వివిధ రాష్ట్రాలలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపడుతున్నాయని త్వరలోనే ఢిల్లీ బాంబుపేలుళ్ల కుట్ర కేసును చేధిస్తామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.



# దక్షిణాదివైపు శ్రద్ధా కపూర్

బాలీవుడ్‌లో క్రేజీ కథానాయికల్లో ఒకరుగా రాణిస్తున్న నటి శ్రద్ధాకపూర్. అందాల ఆరబోతకు వెనుకాడని ఈ అమ్మడు కథానాయకిగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్నారు. ఇటీవల స్త్రీ–2 చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. 38 ఏళ్ల ఈ మహారాష్ట్ర బ్యూటీ ఆ మధ్య ప్రభాస్‌కు జంటగా సాహో చిత్రం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించారు. చాలా మంది బాలీవుడ్ భామలు దక్షిణాది చిత్రాల్లో నటించడానికి ఆసక్తి చూపుతున్నారు. అదేవిధంగా శ్రద్ధాకపూర్ దృష్టి దక్షిణాదిపై పడింది. ఇప్పటివరకు కోలీవుడ్‌లో నటించని ఈ బ్యూటీకి తాజాగా ఆ కోరిక నెరవేరబోతోందని సమాచారం. ఇంతకుముందు అజిత్ హీరోగా విడాముయర్చి చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు మగిళ్ తిరుమేణి ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోవడంతో చిన్నగ్యాప్ తీసుకున్నారు. తాజాగా తన తర్వాత చిత్రానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. దీన్ని ఆయన తమిళం, హిందీ భాషల్లో రూపొందించనున్నట్లు తెలిసింది. ఇందులో విజయ్‌సేతుపతి హీరోగా నటించనున్నారని, ఆయనకు జంటగా శ్రద్ధాకపూర్‌ను నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా సంజయ్‌దత్‌ను విలన్ పాత్రలో నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఐబొమ్మతో రవి 20 కోట్ల సంపాదన

## అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లు

ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. చిరంజీవితో పాటు నాగార్జున, రాజమౌళి, దిల్‌రాజు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పైరసీ వల్ల సినీ రంగం చాలా నష్టం పోయిందని సజ్జనార్ తెలిపారు. ఆపై అతను 'దమ్ము ఉంటే పట్టుకోండి చూద్దాం' అన్నాడు దీంతో అతన్ని అరెస్ట్ చేయాలని గట్టిగానే అనుకున్నట్లు సజ్జనార్ చెప్పారు. ఈ క్రమంలోనే చిరంజీవి, దిల్ రాజు కూడా పైరసీ గురించి పలు వ్యాఖ్యలు చేశారు. దమ్ము ఉంటే పట్టుకోండి అంటూ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి చేసిన సవాల్‌ను ఒక ఛాలెంజ్‌గా స్వీకరించిన తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసి చూపించారని చిరంజీవి కొనియాడారు. ఈ క్రమంలోనే పైరసీ అనేది ఇండస్ట్రీకి పెద్ద సవాల్‌గా మారిందని ఇలా చెప్పారు. 'సినిమాను నమ్ముకుని కొన్ని వేల కుటుంబాలు ఇక్కడ బతుకుతున్నాయి. గత సీపీ సీవీ ఆనంద్‌తో పాటు ప్రస్తుత సీపీ సజ్జనార్ కలిసి పైరసీ భూతాన్ని పట్టుకున్నారు. చాలా ఏళ్ల నుంచి చిత్రపరిశ్రమను పైరసీ అనేది పీడిస్తూనే ఉంది. ఎన్నో కష్టాలను తట్టకుని ఇండస్ట్రీలో సినిమాలను నిర్మిస్తున్నారు.' అని చిరు అన్నారు. సినిమా పైరసీకి సంబంధించిన కీలక సూత్రధారి రవిని అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు చెబుతూ ఇలా పేర్కొన్నారు. 'మూడు నెలల క్రితమే పైరసీ గురించి అరెస్ట్‌లు మొదలయ్యాయి. ఇలాంటి వెబ్‌సైట్ల వల్ల మీ వ్యక్తిగత డేటా కూడా చోరీ అవుతుంది. మేము చాలా కష్టపడి సినిమాలు తీస్తున్నాం. ప్రేక్షకులు కూడా ఇలాంటి వెబ్‌సైట్లను ఎంకరేజ్ చేయకండి. మీకు కూడా నష్టం జరిగే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం నెలరోజుల్లోనే ప్రతి సినిమా ఓటీటీలోకి వస్తుంది. సంతోషంగా ఇంట్లోనే చూసేయండి. ఇలాంటి పైరసీ వెబ్‌సైట్స్‌లను ఎంకరేజ్ చేసి పరిశ్రమకు నష్టం చేకూర్చకండి.' అంటూ దిల్ రాజు తెలిపారు.



**ఫ్రీగా సినిమా చూస్తున్నామని మాత్రం అనుకోవద్దు**

'ఉచితంగా సినిమా చూపించడం అనేది ఓ ట్రాప్. ఆరు నెలల క్రితం మా కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్‌కు గురయ్యారు. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చాం. కానీ సెకన్ల వ్యవధిలో తప్పించుకున్నాడు. ఉచితంగా సినిమా చూస్తున్నామని వెబ్‌సైట్ తెరిస్తే మన వివరాలు అన్ని వాళ్ళకు వెళ్ళిపోతాయి. పైరసీ ద్వారా రూ.20 కోట్లు సంపాదించారు అనేది చాలా చిన్న సొమ్ము. వాళ్ల సంపాదన వేల కోట్లల్లో ఉంటుంది' అని నాగార్జున తన కుటుంబంలో ఎదురైన అనుభవాన్ని బయట పెట్టారు.

**డిజిటల్ అరెస్ట్ అంటే?**

డిజిటల్ అరెస్ట్‌లో భాగంగా మోసగాళ్లు.. ఆయా వ్యక్తులకు వాట్సాప్ ద్వారా ఫోన్ కాల్ చేస్తారు. సీబీఐ, ఆదాయ పన్ను, కస్టమ్స్ అధికారుల్లా నటించి సదరు వ్యక్తులని ఫోన్‌లోనే బెదిరిస్తారు. మీరు లేదా మీ కుటుంబ సభ్యుల్లో ఒకరు మనీలాండరింగ్, పన్ను ఎగ్గొట్టడం, డ్రగ్స్ రవాణా లాంటి కేసులో బుక్ అయ్యారని, అందులో మీ పేరు లేదా అడ్రస్ ఉందని అంటారు. మీ ఆధార్ కార్డు, పాన్ కార్డ్ ద్వారా అక్రమ లావాదేవీలు జరిగాయని భయపెడతారు. ఈ కేసులో మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ బెదిరిస్తూ, వ్యక్తిగత బ్యాంక్ వివరాలు కోరతారు లేదా పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తారు. ఇలాంటి కేసుల్లో సాధారణంగా పెద్ద మొత్తంలో మీ తరపున హామీగా డబ్బు డిపాజిట్ చేయాలని, కేసు దర్యాప్తు పూర్తయ్యాక దాన్ని తిరిగి ఇచ్చేస్తామని అంటారు. సమాజంలో తమ పరువు పోతుందనే భయంతో చాలామంది ఈ ట్రాప్‌లో పడిపోతుంటారు. ఇలా జరగడానికి ప్రధాన కారణం.. మనం అనధికారిక సైట్లలోకి వెళ్లినప్పుడు మన వివరాలు వాళ్లకు చేరిపోతాయి. తర్వాత మనకు ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ అంటూ బెదిరిస్తారు. హీరో నాగార్జున కూడా తమ కుటుంబంలోని ఓ వ్యక్తికి ఇలా జరిగిందని చెప్పడం షాకిచ్చింది.

# మలయాళ ఇండస్ట్రీకి నేను అక్కర్లేదు..

మలయాళ బ్యూటీ హనీరోజ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టి 20 ఏళ్లవుతోంది. ఈ సందర్భంగా తను ప్రధాన పాత్రలో నటించిన రాహెల్ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎమోషనల్ కామెంట్స్ చేసింది. హనీరోజ్ మాట్లాడుతూ.. మలయాళ సినిమాకు నా అవసరం ఉందా? అని నన్ను అడిగితే లేదనే చెప్తాను. నేనే ఈ ఇండస్ట్రీకి గట్టిగా అతుక్కుపోయాను. నేను ఇండస్ట్రీలో అడుగుపెట్టి రెండు దశాబ్దాలవుతోంది. దర్శకుడు వినాయన్ సర్ మొదటి నుంచి నా చేయి పట్టుకుని నడిపిస్తున్నారు. ఈ సినిమాతో నా కెరీర్ టర్న్ అవుతుందని ఆయన భావిస్తున్నారనుకుంటా! నాకు బోలెడన్ని అవకాశాలు రావాలి.. వచ్చిన సినిమాలన్నీ చేసుకుంటూ పోవాలని నేనెప్పుడూ అనుకోలేదు. వచ్చినవాటిలో ఉత్తమమైన వాటినే ఎంపిక చేసుకుంటాను. వాటికోసమే కష్టపడతాను. సినిమా అంటే నాకు అంత పిచ్చి అని హనీరోజ్ చెప్పుకొచ్చింది. వినాయన్ మాట్లాడుతూ.. మలయాళంలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న హీరోయిన్ల కంటే కూడా హనీరోజ్ ఎక్కువ సంపాదిస్తుంది. ఆమెకు ఈవెంట్లు, ప్రోగ్రామ్‌ల ద్వారా మంచి ఆదాయం వస్తుంది. కానీ, తనకు డబ్బు కన్నా సినిమా అంటేనే ఎక్కువ ఇష్టం. రాహేల్‌లో హనీ.. నేను ఊహించినదానికన్నా అద్భుతంగా నటించింది అని చెప్పుకొచ్చాడు. ఈమె తెలుగులో ఆలయం, ఈ వర్షం సాక్షిగా, వీర సింహా రెడ్డి చిత్రాల్లో నటించింది.





# ఘట్టమనేని వారసుడి ఫస్ట్ సినిమా

ఘట్టమనేని వారసుడు జయకృష్ణ (ఘట్టమనేని రమేశ్‌బాబు తనయుడు)కు జోడీగా బాలీవుడ్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రాషా టాండానీ నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'ఆర్ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ ప్రాజెక్ట్ గురించి కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా హీరోయిన్ పోస్టర్‌ను ఆయన షేర్ చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్‌తో అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో అజయ్ దేవగన్ చిత్రం 'అజాద్'లో ఓ కీలకపాత్రలో నటించి, మెప్పించిన రాషా టాండన్ ఇప్పుడు టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుంది. త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది. ఎమోషనల్ లవ్ స్టోరీతో అజయ్ భూపతి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జయకృష్ణ, రషా టాండన్ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంటుందో చూడాలంటే కొంత కాలం ఆగాల్సిందే.



# యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ ప్రచారకర్తగా కీర్తీ సురేష్

న్యూఢిల్లీ: నటి కీర్తి సురేష్ యునిసెఫ్ ఇండియాకు సెలబ్రిటీ ప్రచారకర్తగా నియమితులయ్యారు. పిల్లల మానసిక ఆరోగ్యం, హక్కుల గురించి ఆమె పనిచేయనున్నారని యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ ఆదివారం ప్రకటించారు. అమితాబ్ బచ్చన్, సచిన్ టెండూల్కర్ వంటి ప్రముఖులతో కలిసి ఆమె ఈ కార్యక్రమంలో భాగం పంచుకోనున్నారు. తన కొత్త బాధ్యతల పట్ల కీర్తి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. 'పిల్లలు శ్రేయస్సు మన బాధ్యత. మన పెంపకం, ప్రేమపూర్వక సంరక్షణ వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి పునాది వేస్తుంది. మరింత ఆరోగ్యకరమైన జీవితాలను గడపడానికి తోడ్పడుతుంది. వారి నేపథ్యం, సామర్థ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి అభివృద్ధికి సమాజంలో అవగాహనకు యునిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం నాకు గౌరవంగా ఉంది' అని ఆమె ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com